సిఇకి సమ్మె నోటీసు అందజేస్తున్న స్ట్రగుల్ కమిటీ నాయకులు

మృతి చెందిన చరణ్

అనారోగ్యంతో హాస్టల్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి-కమలాపురం

వీరపనాయునిపల్లె మండల కేంద్రంలోని బిసి హాస్టల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న చరణ్ (13) అనే విద్యార్థి సోమవారం ఉదయం మృతి చెందాడు. వివరాలు.. పెండ్లిమర్రి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన చరణ్ బిసి హాస్టల్ ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి నుంచి అతనికి వాంతులు, విరోచనాలు కావడంతో సోమవారం ఉదయం హాస్టల్ సిబ్బంది 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యలో చనిపోయాడు. మృతదేహాన్ని ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రెగ్యులర్ హాస్టల్ వార్డెన్ లేకపోవడంతోనే తమ బిడ్డ చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ కుమారుడి మృతిపై పోలీసు కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని వారు కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే...

కడప అర్బన్ : వీరపునాయునిపల్లెలోని ప్రభుత్వ బిసి హాస్టల్‌లో 8వతరగతి చదువుతున్న విద్యార్థి చరణ్ మృతికి అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఆర్.నాయక్, సగిలి రాజేంద్ర ప్రసాద్, డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం విద్యార్థి మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పందనలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందడం దారుణమన్నారు. హాస్టల్ వార్డెన్ ఇన్‌ఛార్జి కావడంతో విద్యార్థుల పర్యవేక్షణ కొరవడిందని చెప్పారు. ఎబిసి డబ్ల్యుఒ పులివెందులలో ఉండడం వల్ల హాస్టల్ తనిఖీలు చేయకపోవడంతో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకోవడం కష్టమైందన్నారు. హాస్టల్‌లో రెగులర్ వార్డెన్ ఉండి ఉంటే విద్యార్థి అనారోగ్యానికి గురైన వెంటనే రాత్రి సమయంలో ఆస్పత్రికి తరలించి ఉంటే అతను బతికేవాడని చెప్పారు. విద్యార్థి మృతిపై కలెక్టర్‌తో విచారణ జరిపి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికా రులు, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అదించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరి ంచారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాహులు, జిల్లా నాయకులు అజయ్, రాజశేఖర్, వర్ధన్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

కడప అర్బన్ : టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021, నవంబర్ 16న జరిగిన హత్య కేసులో నిందితుడు షేక్ ఖాదర్‌వలికి జిల్లా కోర్టు యావజీవ కారాగార శిక్ష విధించిందని డిఎస్‌పి షరీఫ్ వెల్లడించారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితుడు ఖాదవలి చిన్న పిల్లల విషయంలో పిర్యాది పఠాన్ ఆరిఫా ఖానం అనే మహిళ భర్తతో తరచూ గొడవపడేవాడని తెలిపారు. ఈ నేపథ్యంలో 2021, నవంబర్ 16న రాత్రి 9.45 గంటల సమయంలో ఖాదర్‌వలి పిర్యాది ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడని పేర్కొన్నారు. ఈవిషయం ఆమె భర్తకు తెలియజేయడంతో అతను ఇంటికి వచ్చి ఎందుకు గొడవ పడుతున్నావని ప్రశ్నించాడని తెలిపారు. దీంతో నిందితుడు కోపోద్రిక్తుడై తన వెంట తెచ్చుకున్న కత్తితో పిర్యాది భర్తను పొడవడంతో అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారన్నారు. సోమవారం ముద్దాయిపై నేరం రుజువు కావడంతో అతనికి నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఇంతియాజ్ అహమ్మద్ యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధించారన్నారు జరిమానా కట్టని పక్షంలో 1 నెల జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించాడనిని పేర్కొన్నారు.

జెవివి నగర నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కడప అర్బన్

శివరాం కిరణ్‌కుమార్

జెవివి కడప నగర అధ్యక్షులుగా శివరాం, ప్రధాన కార్య దర్శిగా కిరణ్ కుమార్, కోశాధికారిగా గోవిందు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ దేశంలో మూఢనమ్మకాలు, హింస పెరిగి పోతున్నాయని అన్నారు. వీటిని ఎదుర్కోవాలంటే సైన్స్ ప్రచారం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని చెప్పారు. అసత్య ప్రచారాల ద్వారా ప్రజలను హింస వైపు ప్రేరేపిస్తున్నారని అన్నారు. మణిపూర్‌లో జరిగే హింస, అత్యాచారాలను కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అరికట్టి శాంతిని పునరుద్దరించాలని కోరారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ ప్రసాద్ రాజు, నిర్మల, గౌరవ సలహాదారులుగా కుమారస్వామి రెడ్డి, భాస్కర్, ఉపాధ్యక్షులు అబ్బాస్ వలి, వసంత్, రామాంజనేయ రెడ్డి, కామేశ్వరమ్మ, బండి ప్రసాద్, సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ కార్యదర్శులుగా ప్రకాష్, ధన్‌రాజ్, గోపినాథ్, కలీమ్ వల్లీ, మధుసూదన్, కరిముల్లా ఎన్నికయ్యారు.

చేనేతలకు ముద్ర రుణాలివ్వాలి

కడప అర్బన్ : జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్క చేనేత కార్మికుడికీ సబ్సిడీ కింద ముద్ర రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వీరణాల శివ నారాయణ, ఓబులేసు తెలిపారు. సోమవారం స్పందనలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చేనేత కార్మికులు మగ్గం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా చేనేతలు నానాటికీ మగ్గాలను వదిలి ఇతర వృత్తులు పైన జీవిస్తున్నారన్నారు. కనీసం వారికి సబ్సిడీ కింద ముద్ర రుణాలు అందివ్వాలని చేనేత జౌలి శాఖ అధికారులను విన్నవించినా, దరఖాస్తులు ఇచ్చిన పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారన్నారు. కనీసం అర్హులు పట్ల సర్వేలు కూడా నిర్వహించకుండా దారుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులైన ప్రతి ఒక్క చేనేత కార్మికుడికి సబ్సిడీ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరణాల శివకుమార్ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ నిర్మించే వరకూ పోరాటం

ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మించే వరకు పోరాటం నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం సాధనకై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో ఫస్ట్ క్వాలిటీ ఐరన్ ఓర్సు సమృద్ధిగా ఉన్నాయని కేంద్రం స్టీల్ అథారిటీ పరిశోధనలు చేసి, నివేదిక గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి అందించిన ఆధారంగానే 2007లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'బ్రాహ్మణి స్టీల్' నిర్మాణానికి జమ్మలమడుగు మండలం, చిటిమిటి చింతలలో శంకుస్థాపనలు చేశారని గుర్తు చేశారు. 2018 డిసెంబర్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు కంబాలదిన్నెలో శంకుస్థాపన చేశారని తెలిపారు. 2019లో కన్యతీర్థం వద్ద జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ఒకమారు, 2023లో ఫిబ్రవరి నెలలో మరో మారు శంకుస్థాపనలు చేసి ప్రయివేట్ కంపెనీలకు ఇచ్చిన విషయాన్ని తెలిపారు. కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ఉన్న మెండుగా అవకాశాలను దృష్టిలో పెట్టుకొని బిజెపి కేంద్ర, రాష్ట్ర కమిటీలు కర్నూలు డిక్లరేషన్‌పేరుతో కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేస్తామని బహిరంగ తీర్మాన ప్రకటన చేశారన్నారు. ఈనెల జులై మొదటి వారంలో ఆంధ్రప్రదేశ్ నూతన బిజెపి అధ్యక్షురాలుగా ఎన్నికైన పురందేశ్వరిదేవి కర్నూల్, కడపలో సభలు పెట్టి బిజెపి కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని కట్టుబడి ఉందని చెప్పిన నాలుగవ రోజే పార్లమెంటులో బిజెపి హోమ్‌శాఖ సహాయ మంత్రి కడప ఉక్కు లాభదాయకం కాదని చెప్పటం బిజెపి రెండు నాలుకల ధోరణికి, డబల్ ఇంజిన్ విధానానికి నిదర్శనం అని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా 15 సంవత్సరాలు ఇస్తానని బిజెపి ఎన్నికల ముందు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పి, అధికారంలోకి రాగానే మొండి చేయి చూపించిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి బిజెపి చేసిన మోసం ప్రశ్నించకుండా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ముద్దుబిడ్డలుగా ప్రవర్తిస్తున్నాయని వాపోయారు. వైసిపి జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని ఊరిస్తున్నారని, 30 నెలల్లో జిందాల్ ప్రయివేట్ కంపెనీ మొదటిదశ ఉక్కు పరిశ్రమ ప్లాంట్ పూర్తవుతుందని చెప్పి, నేటికీ ఆరు నెలలు గడిచిపోయిందని, శంకుస్థాపన చేసిన స్థలంలో కనీసం చుట్టూ ప్రహరీ కూడా నిర్మించలేదని చెప్పారు. సెయిల్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించే వరకు కలిసి వచ్చే పార్టీలు సంఘాలు ప్రగతిశీల భావాలు ఉన్న మేధావులతో కలసి సిపిఎం ఉద్యమం కొనసాగిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.శివకుమార్, ఎ.రామ్మోహన్, బి.మనోహర్, ఐ.ఎం.సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు, వి.అన్వేష్, కే.సత్యనారాయణ, బి.దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, ఎం.పాపిరెడ్డి, సిపిఎం నాయకులు ఎన్ .భైరవ ప్రసాద్, ఎన్ .వీరయ్య, శివనారాయణ, నరసయ్య, శివ, చిన్ని , రాజేంద్ర , చాంద్ భాష, ముంతాజ్ బేగం, జమీల, గౌసియా, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచులను ఉత్సవ విగ్రహాల్లా మార్చిన వైసిపి

- సర్పంచుల మహాధర్నాలో అఖిలపక్ష నేతలు

మహాధర్నాలో మాట్లాడుతున్న రాష్ట్ర సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

సర్పంచులను ఉత్సవ విగ్రహాల్లా మార్చిన ఏకైక ప్రభుత్వం వైసిపినే అని అఖిలపక్ష నేతలు పేర్కొన్నారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముని రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఉమ్మడి జిల్లాల సర్పంచులు మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సర్పంచుల ధర్నాకు సిపిఎం, టిడిపి, కాంగ్రెస్. బిజెపి, జనసేన, సిపిఐ, లోక్‌సత్తా పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి ఇవ్వకపోగా గ్రామ పంచాయతీల కేంద్ర ఆర్థిక నిధులు రూ. 8,066 కోట్లు సొంత పథకాలకు వాడుకున్నారని పేర్కొన్నారు. ఇంటి పన్ను, నీటి పన్ను ద్వారా పంచాయతీలకు వచ్చే నిధులు విద్యుత్ సాకుతో నిలిపి వేశారన్నారు. దొంగలించిన నిధులు ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన నిధులు విడుదల చేసిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరితో వైసిపి సర్పంచుల ఉద్యమానికి మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 2న రాష్ట్ర ప్రభుత్వ తీరు పై కేంద్ర ప్రభుత్వానికి సర్పంచులతో కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌ఛార్జి తులసి రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థకు ఒక చరిత్ర ఉందన్నారు. ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని ఎన్నుకుంటే, సర్పంచ్‌ను ప్రజలు ఎన్నుకుంటారని చెప్పారు. గ్రామాల్లో సమస్యలను ప్రజలు నేరుగా సర్పంచులకు చెబుతారన్నారు. పైసా నిధులు ఇవ్వకపోతే సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. వాలంటరీ వ్యవస్థ కుటుంబ వ్యవస్థ అని ఇక ఎన్నికలు ఎందుకన్నారు. టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, హరి ప్రసాద్, గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో సర్పంచులకు విధులు ఉన్నాయే తప్ప కానీ నిధులు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వ పంచాయతీ నిధులు దారి మళ్లించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అన్నారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీకి నిధులు ఇచ్చి అభివృద్ధి చేసింది తెలుగుదేశం అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ పంచా యతీ వ్యవస్థ రాజ్యాంగబద్ధంగా ఏర్పడిందని, నిర్వీర్యం చేయడం ఏ రాష్ట్రంలో జరగలేదన్నారు. హక్కుల పోరాటానికి ఎంత వరకైనా వెళతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లోక్‌సత్తా పార్టీ దేవర శ్రీకృష్ణ మాట్లాడుతూ అవగాహన రాహిత్యంతో జగన్ పాలన చేస్తూ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్ రాయుడు. టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి. సర్పంచులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సర్పంచులు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు అఖిలపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల ఆందోళన

కడప అర్బన్ : బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఎఐబిడిపిఎ, ఎస్-ఎస్‌టిడబ్ల్యుఎ జిల్లా కార్యదర్శులు కళ్యా సుధాకర్, ఒ. రెడ్డప్ప డిమాండ్ చేశారు. సోమవారం బిఎస్ఎన్ఎల్ జీఎం కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్ల పెన్షన్ రివిజన్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రధానమైన సమస్య పట్ల అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 21 నుంచి 25 వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఐదు రోజులపాటు ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు సుబ్బారెడ్డి, కొండన్న, ఈశ్వరయ్య, బాష, దస్తగిరి వెంకటసుబ్బయ్య, రమణ, వెంకటేశ్వర్లు, పెన్షనర్లు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

కడప అర్బన్ : భూమిలేని ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు వెంటనే భూ పంపిణీ చేయాలని బిసి మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి భూములు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వి.ఆర్. శంకర్, రాయలసీమ ఎస్‌సి, ఎస్‌టి హ్యూమన్ రైట్స్ ఫోరం అధ్యక్షులు పి.వి.రమణ, ప్రతాపరెడ్డి, లంబోధర్, లక్ష్మీదేవి, సుబ్బమ్మ, ఈశ్వరయ్య, వెంకటేష్, పాలయ్య, పీరయ్య, లక్ష్మీ నరసమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలి

కడప : ప్రజల్లో అవగాహన కల్పించి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ సూచించారు. సోమవారం కడప విద్యుత్ డివిజన్ పరిధిలోని అధికారులు బిల్లింగ్ చేసే సిబ్బందితో విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా విద్యుత్ శాఖ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు ఇచ్చే సమయంలో బిల్లింగ్ సిబ్బంది విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లోని యాప్‌ల ద్వారా చెల్లించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులలో వ్యత్యాసాలు లేకుండా ఆటోమెటిక్ బిల్లింగ్ (ఐఆర్‌డిఎ) పద్ధతి ద్వారా ప్రతి ఒక్క సర్వీస్‌కు విద్యుత్ బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఇంటి లోపల ఉండే మీటర్లను బయటకు మార్పించవలెనని తెలిపారు. సమావేశంలో కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. నరసింహ ప్రసాద్ గారు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, అకౌంట్ ఆఫీసర్లు, స్పాట్ బిల్లర్లు పాల్గొన్నారు.

పాఠశాల గేటు పడి విద్యార్థికి గాయాలు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని బోడెద్దులపల్లి ఉర్దూ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ హుసేన్‌పై మెయిన్‌గేట్ పడి తలకు తీవ్రగాయమైంది. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం బాలుడిని నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి సిమ్స్‌కు తీసుకెళ్లారు. విద్యార్థిని డిఇఒ రాఘవరెడ్డితోపాటుమండల విద్యాశాఖ అధికారి 2 రమాదేవి పరామర్శించారు.

ముగిసిన మొహర్రం

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలో చివరి రోజైన సోమవారం మొహర్రం పండుగ ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలసి పండుగ చేసుకున్నారు. గ్రామంలోని రెండు పీర్ల చావిళ్లలో గుమ్మటాలు ఏర్పాటు చేశారు. ప్రజలందరూ సాయంత్రం 6 గంటలకు చావిళ్ల వద్దకు వెళ్లి కార్యక్రమాలను వీక్షించారు. కార్యక్రమంలో రెండు చావిళ్ల ముజావర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగు నీటి రంగంపై నిర్లక్ష్యం : పిసిసి

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రానికి సాగునీటి రంగం గుండెకాయ లాంటిదని, వైసిపి , టిడిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడపలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సాగునీటి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుతం సాగునీటి రంగానికి అధిక ప్రాముఖ్యత ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీ, ధవళేశ్వరం బ్యారేజీలు, నిర్మించారని తెలిపారు. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగొండ, పులిచింతల ప్రాజెక్టులలో సింహభాగం హక్కులు కాంగ్రెస్ పాలనలో పూర్తి అయ్యాయన్నారు. టిడిపి హయాంలో బడ్జెట్ కేటాయింపులు 9శాతం తగ్గించగా, జగన్ పాలనలో రెండు శాతానికి తగ్గించడంతో కొత్త ప్రాజెక్టులు పూర్తి కాలేదని తెలిపారు. పోలవరానికి బిజెపి శనిగ్రహం, వైసిపి, టిడిపి రాహు కేతువులుగా తయారయ్యాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతంరెడ్డి, రాష్ట్ర నాయకులు నజీర్ అహ్మద్, సత్తార్, బొజ్జా తిరుమలేష్, ప్రసాద్ గౌడ్, కోటపాటి లక్ష్మయ్య, అలీఖాన్, అరిపుల్ల జిల్లా నాయకులు మధురెడ్డి, మామిళ్ళ బాబు, పుల్లయ్య, బి. సుబ్బరాయుడు, ఉత్తన్న, అమర్ పాల్గొన్నారు.

వాహన బీమాపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప

వాహన యజమానులు, ఆటో యూనియన్ వారు ప్రతి ఒక్కరూ వాహన బీమా గురించి అవగాహన పెంచుకోవడంతో పాటు వాహనాలకు తప్పనిసరిగా బీమా చేయించాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ఆటో యూనియన్, వాహన యజమానులకు వాహన బీమా గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రామాణికంగా మోటార్ వాహన బీమా థర్డ్ పార్టీ, కాంప్రహెన్స్ అని రెండు విధాలుగా ఉంటుందని తెలిపారు. మోటార్ వాహనాలు చట్టం సెక్షన్ 146 ప్రకారం ప్రతి వాహనానికీ తప్పనిసరిగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. వాహన బీమా సరైందో, కాదో వాహన పోర్టల్ నుంచి సరి చూసుకో వాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ యూనియన్ నాయకులుగా సంఘ సభ్యులు అందరితో సరైన బీమా పత్రాలు పొందేలా సహాయం చేస్తామని అన్నారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది కార్మికులకు అందుబాటులో ఉండాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి విజయభాస్కర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ ప్రసన్న, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ప్రకాష్, దేవమ్మ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఉపరవాణా కమిషనర్ మీరా ప్రసాద్

సమ్మె బాటలో ఆర్‌టిపిపి ఉద్యోగులు

చీఫ్ ఇంజినీర్‌కు నోటీసు అందజేత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఈనెల 10 నుంచి నిర్వహించబోయే సమ్మెకు సంబంధించిన నోటీసును నాయకులు ఆర్‌టిపిపి ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజినీర్ కె. సోమశేఖర్‌రెడ్డికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి, కన్వీనర్ పి .శివయ్య మాట్లాడుతూ ఎపి జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కామ్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిస్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 2 నుంచి వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు, ఆగష్టు 10 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు యాజమాన్యం పరిష్కరించకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తుందే తప్ప ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించే వాతావరణం కనబడలేదని మండిపడ్డారు. వేతన సవరణ గడువు ముగిసి 16 నెలలు దాటినా ఇప్పటివరకు కొత్త వేతన సవరణ ప్రకటించలేదని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. చివరకు ఒకటో తారీఖున వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఎప్పుడు అందుతాయో అంటూ ఉద్యోగులు ఎదురు చూడాల్సిరావడం దారుణమన్నారు. ఆదివారం వేతన సవరణ చర్చలకు యాజమాన్యం పిలిచి, ఏకపక్షంగా వాయిదా వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పట్ల యాజమాన్యానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ముఖ్య మంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని, ఇపిఎఫ్ కింద ఉన్న ఉద్యోగులందరినీ జిపిఎఫ్‌కి మార్పు చేసి పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని, చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణకు ఉద్యోగులు, కార్మికులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ వైస్ చైర్మన్ వి .గంగయ్య, ఉద్యోగ సంఘ నాయకులు కొండా రెడ్డి, వెంకట స్వామి, హరి ఓబుల రెడ్డి, గిరిబాబు, గంగాధర్, రమేష్ , వెంకట్, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు చంద్ర శేఖర్, పుల్లారెడ్డి, సాంబశివరెడ్డి, వెంకట రమణ పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ప్రభుత్వంతో 16 నెలల్లో 25 సార్లు చర్చలు జరిపినా ఎటువంటి స్పందన లేదన్నారు. ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ రాష్ట్ర చైర్ మెన్ పి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పరిష్కారం కాకపోతే జిల్లా కార్యాలయం వద్ద ధర్నాలు, 7న తిరుపతిలోని ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సురేంద్ర, నాయబు, బాదుల్లా, ప్రతాప్ రెడ్డి, హరి, వెంకటేష్, నాగ మల్లయ్య పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

నిరసన తెలియజేస్తున్న ఎల్ఐసి యూనియన్ నాయకులు

ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించాలని, సామాన్యులకు రక్షణ కల్పించి, మహిళలపై దారుణాలకు తెగబడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని ఇన్సూరెన్స్ యూనియన్ల నాయకులు రఘునాథరెడ్డి, చంద్రపాల్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా అల్లకల్లోల పరిస్థితి నెలకొని ఉందని చెప్పారు. సామాన్యులు ప్రాణ భయంతో గడుపుతున్నారన్నారు. సరిహద్దు రాష్ట్రంలో ప్రజల మధ్య తగవులు దేశ భద్రతకు ముప్పు కలిగిస్తాయని పేర్కొన్నారు. ఆదివాసులకు, మైదాన ప్రాంత ప్రజలకు మధ్య తగవులు పెట్టి రాజకీయ నాయకులు పబ్బం గడుపుకోవాలని చూడడం తగదని అన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ఆదివాసీ హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పాలకులదే అన్నారు. ఏ మతం, ఏ తెగవారైనా అందరూ భరతమాత బిడ్డలేనని, వారి హక్కులను కాపాడడం ప్రభుత్వాల బాధ్యతని తెలిపారు. భారత రాజ్యాంగ నియమ నిబంధనలు, నిర్దేశాల మేరకు అధికార యంత్రాంగం నడుచుకోవాలని కోరారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటన జరిగి రోజులు గడుస్తున్నా బాధితులకు న్యాయం జరగకపోవడం దారుణమని అన్నారు. మణిపూర్ ప్రజల, మహిళల రక్షణ కోసం గొంతెత్తాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ల నేతలు అవధానం శ్రీనివాస్, అక్బర్, వారిజాతమ్మ, అమీనా పర్వీన్, మూర్తి, శ్రీధర్, రమణ, రాజు, అయ్యవారు రెడ్డి, శ్రీవాణి, వసుప్రద, శ్రీకృష్ణ, కుమార్, మహేశ్వర్ రెడ్డి, జయచంద్ర, ఎల్లయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ అవినీతిపై విచారించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఐసిడిఎస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్యపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. సోమవారం స్పందనలో కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కమలాపురం సిడిపిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్య ఎక్కువగా శాతం కడప పీడీ కార్యాలయం వద్ద ఉంటారని చెప్పారు. ఆయాల ప్రమోషన్ విషయంలో లక్షల రూపాయలు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. యర్రగుంట మండలం మలేపాడు గ్రామంలో సీనియారిటీ ఆధారంగా అర్హులైన అయాలకు ఉద్యోగోన్నతులు ఇవ్వలేదన్నారు. కార్మికుల మధ్య గొడవలు సృష్టించి ఐసిడిఎస్‌కు చెడ్డ పేరు తెస్తున్నారని చెప్పారు. పోపు సామాన్ల బిల్లులు 3 నుంచి 4 శాతం వరకు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి సన్మానం

ప్రజాశక్తి - కడప

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. అన్నపూర్ణ దంపతులను కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కడప జిల్లా కోర్టులో సోమవారం సాయంత్రం కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు పి.ఎస్. బాలసుబ్రమణ్యం, బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు, సన్మాన సభ కడప జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి మాట్లాడుతూ నెల రోజులపాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పి. అన్నపూర్ణ అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లా కోర్టులో పనిచేసిన కాలంలో అందరూ తమ వంతు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాల్గవ అదనపు జిల్లా జడ్జి గీత, సబ్ జడ్జి ఎస్. కవిత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. ప్రదీప్ కుమార్, రెండవ అదనపు జిల్లా జడ్జి భార్గవి, పిడిఎం ప్రసూన, ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ స్రవంతి, జడ్జిలు, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.కె.అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైమ్ బారిన పడ్డ బాధితులు ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు. www.cybercrime.gov.in ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయొచ్చని ప్రజలకు సూచించారు.

మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే సిఎం ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అభివృద్ధి, సంక్షేమమే సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎపి ప్రెస్ అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఆయన సోమవారం పులివెందులలోని పలు ప్రాంతాలను పర్యటించారు. ముందుగా ఆయన ఆర్‌టిసి బస్టాండ్‌ను పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో కొమ్మినేని మాట్లాడుతూ పులివెందుల ప్రాంతం ఒక మోడల్ సిటీగా తయారయ్యేలా అన్ని అభివృద్ధి పనులు ఇక్కడ జరుగుతున్నాయని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు పులివెందుల ప్రాంతంలో అడుగుపెట్టే అర్హతలేదన్నారు. వైఎస్ వారి సుదీర్ఘ పాలనలో పులివెందుల ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు తన నియోజకవర్గమైన కుప్పంను అభివృద్ధి చేసుకోలేపోయారన్నారు. అలాంటి చంద్రబాబు పులివెందుల ప్రాంతం, రాయలసీమలో ప్రాజెక్టులను అభివృద్ధి చేశానని చెప్పుకోవడం శోచనీయమన్నారు.

మార్కెట్ యార్డ్ సిబ్బందికి యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

యూనిఫాం పంపిణీ చేస్తున్న మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ చిన్నప్ప

పట్టణ పరిధిలోని మార్కెట్ యార్డ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సోమవారం యూనిఫాం పంపిణీ చేశారు. మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ చిన్నప్ప అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సిబ్బందికి ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున యూనిఫాం పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి రాజు, సిబ్బంది అరుణ్, లావణ్య పాల్గొన్నారు.

నేడు గండి ఫీడర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట 33 కెవి సబ్‌స్టేషన్ నుండి వెలువడే 11కెవి గండి ఫీడర్ పరిధిలో చెట్లు తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎఇ ప్రవీణ్‌కుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

ఐటిఐకి స్థలం కేటాయింపులో నిర్లక్ష్యమేల..?

డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం ప్రభుత్వ ఐటిఐ కాలేజీకి స్థలం కేటాయించి, నిర్మించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కడప కలెక్టరేట్ వద్ద స్పందనలో డిఆర్‌ఒకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మైలవరం మండలం కేంద్రానికి ప్రభుత్వ ఐటిఐ కాలేజీని 2015లో అప్పటి ప్రభుత్వం కేటాయించిందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు కాలేజీ మాత్రమే కేటాయించారు కానీ భూ కేటాయింపు చేయలేదన్నారు. ఎన్నో సంవత్సరాలు అవుతున్నా ఎందుకు కాలేజీ స్థలంపై నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికే స్థానిక తహశీల్దార్, ఆర్‌డిఒకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. విద్యార్థులకు సౌకర్యవంతం కోసం జమ్మలమడుగు ప్రభుత్వ ఐటిఐ కాలేజీలో మెర్జ్ చేశారని, ఇది విద్యార్థులకు అసౌకర్యంగా ఉందన్నారు. తరగతి గదులకు, ప్రాక్టికల్స్‌కు సరిపడ భవనాలు లేవన్నారు.

ఆంజనేయస్వామి దేవస్థానంలో పరకామణి లెక్కిస్తున్న అధికారులు

పలు ఆలయాల్లో హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక ఎద్దులకొండపై వెలసిన శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ కానులను లెక్కించినట్లు ఆలయ ఇఒ శ్రీధర్ తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఎద్దులకొండపై శ్రీ వృషభాచలేశ్వర స్వామి ఆలయంలో హుండీలు లెక్కించగా రూ.2,996 ఉందన్నారు. వేంపల్లెలోని మెయిన్ బజార్‌లో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న హుండీలో రూ.33,764, కడప రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలో రూ.94,907 ఉన్నట్లు వివరించారు. మూడు ఆలయాల్లోని హుండీల ద్వారా రూ.1,31,667 దేవస్థానానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సంప్రదాయ వస్త్రధారణతో పరకామణి నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కడప గ్రూప్ టెంపుల్స్-2 ఇఒ శ్రీనివాసులు, ఆలయ పాలకమండలి ఛైర్మన్ కుర్రాకుల వెంకటేష్, సభ్యులు పుల్లగూర అరవింద్, ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రవీణ్, అర్చకులు అచ్యుత్ నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది కొండయ్య, దాసిరెడ్డి, లక్ష్మీరెడ్డి, వేంపల్లె ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

రక్తం ఇస్తున్న దాత భార్గవ్‌సాయి

ప్రాణాపాయాన్ని తప్పించే రక్తదానం చాలా గొప్పదని మే ఐ హెల్ప్‌యు ఫౌండేషన్ ఛైర్మన్ లక్షణ్‌మోరే అన్నారు. స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు గర్భాశయం సమస్యతో ఒ నెగెటివ్ రక్త అవసరం కాగా.. సోమవారం ఫోన్ ద్వారా మోరేని సంప్రదించగా ఫౌండేషన్ సభ్యుడు భార్గవ్‌సాయి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మోరే మాట్లాడుతూ రక్తదాన చేయడం వల్ల ఇద్దరికి ఉపయోగకరమన్నారు. రక్తదాతలను ప్రోత్సహించాలన్నారు. రక్తదాత భార్గవ్‌సాయికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు చక్రాయపేటకు ఎంపీ రాక

ప్రజాశక్తి - చక్రాయపేట

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఉదయం మండలంలోని మహాదేవపల్లెకు వస్తున్నారని జడ్‌పిటిసి టి.శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహాదేవపల్లెలో పలు ప్రారంభోత్సవాలు చేయనున్నారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, వైసిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

మాగోడు ఒకసారి వినండి సారూ..!

ఒకరి ఆస్తికి వేరొకరి ఆధార్‌కు లింక్ - సంక్షేమ పథకాలు అందడం లేదని బాధితుల ఆవేదన

సమస్యను పరిష్కరించాలని కోరుతున్న బాధితులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని వివిధ సచివాలయాలు పరిధిలో తమ ఆధార్ కార్డు మరొకరి ఆస్తి పన్నుకు లింక్ చేయడం వల్ల తాము ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోవడంలేదని మోరగుడి గ్రామానికి చెందిన పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు వారు స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ మోరగుడి గ్రామానికి చెందిన తమకు జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో 1000 చదరపు గజాలు ఆస్తి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతోందన్నారు. సాంకేతిక సమస్య కారణం చూపి రెండేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తాము అనర్హులమని వస్తోందన్నారు. తమ దరఖాస్తులను అధికారులు తిరస్కరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మఒడి, నేతన్న నేస్తం, విద్యాదీవెన వంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదని వాపోయారు. గతేడాది స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చామన్నారు. అయినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇటీవలే జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తమ సమస్యలను చెప్పామని, ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని వారు తెలిపారు. అలాగే 'జగనన్నకు చెబుదాం'కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

మా పేరుపై ఆస్తి చూపిస్తుంది

జమ్మలమడుగు పట్టణంలోని 12వ వార్డులో అసైన్మెంట్ నెంబర్ 124008006 మా పేరుపై ఆస్తి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదైంది. తద్వారా అమ్మఒడి, పెన్షన్ రావడం లేదు. మాకు జమ్మలమడుగు పట్టణంలో ఎలాంటి ఆస్తులు లేనప్పటికీ ఆధార్ కార్డు నంబర్‌తో లింక్ కావడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదు.

- టి.లక్ష్మీనారాయణ, మోరగుడి

అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు

రెండేళ్లుగా పలువురు అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు. జమ్మలమడుగు పట్టణంలోని 18వ వార్డు సచివాలయంలో తమ ఆధార్ కార్డుపై నమోదైన ఆస్తి పన్ను అసైన్మెంట్ నెంబర్ 1124010280 మున్సిపల్ అధికారులు తొలగించాలి. ప్రభుత్వ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

- డి.భాగ్యలక్ష్మి, మోరగుడి

సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు దాసరి విజయ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలును కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) దశలవారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి శేఖర్, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ తెలిపారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో 40 వేలకు పైగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులుగా (ఆప్కాస్), 10 వేలకు పైగా సిపిఎస్ ఉద్యోగులు, 2 వేల మంది క్లాప్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారే తప్ప వారి సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రతిపక్షనేతగా అసెంబ్లీలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్‌కు పెద్ద తేడా లేదని, వారిని నమ్మించి మోసం చేశారని, తమ ప్రభుత్వం వచ్చాక పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కనీసం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కూడా ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 15 తర్వాత రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేపట్టవలసి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు నాగన్న, కోశాధికారి శివన్న, ఎపి నాయకుడు నరేంద్ర, రాజు, దివాకర్ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి విద్యుత్ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు కోరారు. స్థానిక డిఇ కార్యాలయంలో పులివెందుల డివిజన్ పరిధిలో ఉన్న అన్ని మండలాల్లో పనిచేస్తున్న లైన్ ఇన్స్పెక్టర్స్, లైన్‌మెన్స్ విద్యుత్ ఉద్యోగులతో కలిసి డివిజన్ కార్యాలయం నుండి సుమారు వందమంది ర్యాలీగా బయల్దేరి పట్టణంలోని 4 రోడ్ల కూడలిలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గాంధీ విగ్రహానికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగుల ఐక్యత, విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెఎసి అశోక్‌బాబు, కన్వీనరు జగన్‌మోహన్‌రెడ్డి,సెక్రెటరీ జగదీశ్వర్‌రెడ్డి, గురుమోహన్ రెడ్డి, డివిజన్ సంబంధించి వర్కర్స్, పలువురు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

మాతృభాష మృదుమధురం

- వైవీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

కళాశాలను తనిఖీ చేస్తున్న డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి

మాతృభాష మృదుమధురంగా ఉంటుందని, పిల్లల్లో తల్లిప్రేమలాగా మక్కువ కల్పించాలని వైవీయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని చిన్న గురువలూరులోని శ్రీ స్వామి వివేకానంద బిఇడి కళాశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షను పరిశీలించారు. తెలుగులో పద్యాలు రాగయుక్తంగా చెప్పాలని సూచించారు. రాగయుక్తంగా తెలుగు పద్యాలు పాడి, వాటి భావాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బిఇడి ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ పర్యవేక్షణలో భాగంగా జిల్లాలో అన్నిచోట్ల పర్యటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సువర్ణలక్ష్మి, ఉపాధ్యాయులు కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - చాపాడు

స్థలదాతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

వైసిపి పాలనలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎస్‌రఘురామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ ప్రభుత్వ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో రూ.21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్‌బికె భవనాన్ని సోమవారం సర్పంచు గోసుల కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రభుత్వం అన్ని రకాల హంగులతో నిర్మిస్తుందన్నారు. రైతులకు కావలసిన ఎరువులు, మందులు ఆర్‌బికెలో అందుబాటులో ఉంటున్నాయన్నారు. రెండు కార్లు పండించుకునేందుకు నీటి సరఫరా చేపడుతున్నామన్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోందని, 856 అడుగులు రాగానే ఈ నెల 20 నాటికి కెసికి నీరు విడుదల చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపిపి లక్ష్మయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఒఎ మ్యాగీ, పిఆర్ ఎఇ ఈశ్వరయ్య, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, పార్టీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, పివి రమణారెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

స్థల దాతలకు సన్మానం

నూతన ఆర్‌బికె నిర్మాణానికి 6సెంట్ల స్థలాన్ని వితరణ చేసిన గోసుల బాలిరెడ్డి కుమారులు గోసుల యల్లారెడ్డి, బాలవీరారెడ్డి, శేషారెడ్డిని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపేల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

సమస్యలు తీర్చలేని సమావేశాలెందుకు?

సాధారణ సమావేశంలో పలువురు కౌన్సిలర్ల ప్రశ్న

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో నెలకొన్న చిన్నపాటి సమస్యలు తీర్చలేనందుకు సమావేశాలు నిర్వహించడం దేనికంటూ పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్‌ను ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఛైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆమోదానికి ఎజెండా ప్రతులను కౌన్సిలర్లకు ఇచ్చారు. సమావేశం ప్రారంభానికి ముందే ఖర్చులు, జమలకు సంబంధించిన ప్రతులను ఇవ్వాలని, రెండు నెలల ముందు జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ చెప్పినా ఇప్పటివరకు వాటికి సంబంధించిన పత్రాలను ఇవ్వలేదని కౌన్సిలర్ అలీ పేర్కొన్నారు. తర్వాత సమావేశం నుండైనా ఖర్చులు, జమలకు సంబంధించిన పత్రాలను సమావేశానికి ముందుగానే కౌన్సిలర్లకు అందివ్వాలని, లేకుంటే సమావేశాన్ని బహిష్కరిస్తామని హెచ్చరించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి రూ.20 లక్షలతో జరిగిన పనుల గురించి కనీసం వార్డు కౌన్సిలర్‌కు కూడా తెలపకుండా ఎలా చేస్తారంటూ కౌన్సిలర్ నాగిరెడ్డి ప్రశ్నించారు. వార్డులో పైప్‌లైన్, సిమెంట్ రోడ్లు వేయమంటే నిధులు లేవంటున్నారు. నిధులు లేనప్పుడు, సమస్యలు తీరనప్పుడు ఎందుకు సమావేశాలు నిర్వహించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు కౌన్సిల్ సమావేశాల నుండి వీధిలైట్లు స్విచ్‌లు వేయమన్నా నిధులు లేవనడం హాస్యాస్పదమన్నారు. ప్రజలు కౌన్సిలర్లను చూసి నవ్వుతు న్నారంటూ పేర్కొన్నారు. వేంపల్లి రోడ్డులోని ప్రధాన కాలువలో పూడికలు తీయాలని పలుసార్లు చెప్పినా పట్టించుకోలేదని, పలుచోట్ల కరెంటు స్తంభాలు వేయాలని కోరినా ఇంతవరకు వేయకపోవడంతో ప్రజలు ప్రశ్నిస్తున్నారని కౌన్సిలర్ వెంకట లక్ష్మమ్మ తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన సమస్యలను వెంటనే తీర్చేందుకు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపుతామని కౌన్సిలర్లను శాంతపరిచారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

బిసిలను కించపర్చిన వైసిపి నేతలకు బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి - ములకలచెరువు

బిసిల ఆత్మగౌరవాన్ని అవహేళన చేస్తున్న వైసిపి నేతలకు తగిన గుణపాఠం చెప్పాలని టిడిపి రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు అన్నారు. సోమవారం ములకలచెరువులో టిడిపి బిసి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో భాగంగా ఒంగోలులో నిర్వహించిన జయహో బిసి సభకు హాజరైన అధికార పార్టీ బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని, సమస్యలను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'ఉక్కు'పై కేంద్రం వైఖరి సరికాదు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కడప జిల్లా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయలేని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైఖరిని ఖండిస్తూ సోమవారం సిపిఎం జిల్లా కమిటీ అధ్వ ర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాలో సిపిఎం అనుబంధ సంఘాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఇన్‌ఛార్జి ఎఒ నిజాముద్దీన్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వియన్‌కుమార్ వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. విభజన హామీల్లో ప్రధానమైన కడప ఉక్కును విస్మరించడం శోచనీయమన్నారు. 9ఏళ్ల తర్వాత కడప ఉక్కు సాధ్యం కాదని చావుకబురు చల్లగా చెప్పడం దారుణమన్నారు. దీన్ని వ్యతిరేకించని మన రాష్ట్ర ఎంపీల మౌనానికి ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, రాజు అబ్రహం, నరేంద్ర, నాగన్న , మన్సూర్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజా, పుష్పరాజ్, సురేంద్ర, సుబహన్ పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఖాజీపేట

డెంగీ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.ముబీన్ సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవ సం దర్భంగా పత్తూరు, నాగ సానిపల్లె, ఖాజీపేట, సుగాలి తండా, జయ రాంపేట గ్రామాల్లో సోమ వారం ర్యాలీలు నిర్వ హించి, దోమలపై అవ గాహన కల్పించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం మాట్లాడుతూ వర్షాకాలం నీరు గుంతల్లో నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. జ్వరాలు వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలన్నారు. ప్రజలు దోమతెరలు వాడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు వ్యాపించవన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటసుబ్బమ్మ, కడప సబ్ యూనిట్ అధికారి కె.లక్ష్మయ్య, ఆశా నోడల్ అధికారి అరుణకుమారి, సూపర్‌వైజర్స్ కృష్ణప్రియ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఎఎన్ఎంలు విజయమ్మ, రాధ, సుజాత, మెహరున్నీషా, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గా ప్రసాద్, ఆశా కార్యకర్తలు, సువార్తమ్మ, వసంతకుమారి, లక్ష్మిదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బిఎస్.రమణారెడ్డికి విద్యారత్న పురస్కారం

ప్రజాశక్తి - వేంపల్లె

రమణారెడ్డికి అవార్డును అందజేస్తున్న సదాశివారెడ్డి

గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి విశిష్ట సేవలు అందిస్తున్న ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డికి ఒసి సంఘర్షణ సమితి విద్యా రత్న పురస్కార అవార్డును అందజేసింది. ఒసి సంఘర్షణ సమితి పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 40 మంది ప్రముఖులను ఈ ఏడాది ఏప్రిల్ 9న భద్రాచలంలో ఉగాది ప్రతిభా పురస్కారాల పేరుతో సత్కరించింది. ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి కొన్ని కారణాల వల్ల హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సింగం సదాశివరెడ్డి స్థానిక ఉషాకిరణ్ పాఠశాలకు విచ్చేసి బిఎస్ రమణారెడ్డిని దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన పీర్ల పండుగ

ప్రజాశక్తి - లింగాల

మండలంలో అయిదు రోజులుగా నిర్వహిస్తున్న పీర్ల పండుగ సోమవారం ముగిసింది. శనివారం రోజున పెద్ద సరిగెత్తు భాగంగా పెద్ద పీర్లు ఏటికి వెళ్లగా, అదే రోజు రాత్రి చిన్న మస్తాన్, పెద్ద మస్తాన్, మౌలాలి స్వాముల వారి పీరు సిద్ధం చేసి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి దిగువ లింగాల, ఎగువ లింగాల గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నిండు కడవ నీటితో స్వాగతం పలికి, చక్కెర చదివింపులు చేశారు. ఊరేగింపులో భాగంగా డీజే సౌండ్ సిస్టంతో యువకులు నృత్యాలతో అలరించారు. సోమవారం సాయంకాలం కొత్త పీర్ల చావిడి వద్ద నుంచి పాత పీర్ల చావిడి వరకు ఊరేగింపు నిర్వహించి, చక్కెర చదివింపులు నిర్వహించారు.

గ్రామోత్సవంలో పీర్లు

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - లింగాల

ఈ నెల 2న మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పులివెందులలో పర్యటించనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తమ్ముడు భరత్‌రెడ్డి కోరారు. మండలంలోని లింగాల, వెలిదండ్ల, లోపట్నూతల, కోమన్నూతల తదితర గ్రామాల టిడిపి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు మండలంలోని టిడిపి నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపు ని చ్చారు. మండల టిడిపి కన్వీనర్ విశ్వనాథరెడ్డి, సుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, అమర్నాథ్ గౌడ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు

E.P.No.110/2019

O.S.No. 243/2017

కాటం బాలవీరయ్య, వయస్సు 43 సంవత్సరాలు, తండ్రి పెద్ద వీరస్వామి, హిందు, వ్యాపారం, సాకిన్, డోర్‌నెం. 5/230-1, విజయనగరం వీధి, ప్రొద్దుటూరు టౌన్.
...పిటిషనరు/ డి.హెచ్.ఆర్.

Vs

ముసలోగి అనసూయమ్మ, 54 సంవత్సరాలు, భర్త శ్రీనాథుడు, ఉద్యోగి, సాకిన్, డోర్‌నెం.సి/02/401, సెకండ్‌ఫ్లోర్, శ్రీరాంనగర్, హౌసింగ్‌బోర్డు కాలని, కడప టవున్ మరియు జిల్లా.
...రెస్పాండెంట్/జె.డి.ఆర్.

నోటీసు

పై నెంబరులోని పిటిషనరు, రెస్పాండెంట్/జెడిఆర్ అయిన నీపైన నీ తాలూకు Retairment Benfits ను Attachment చేయకోరుచు, పై నెంబరు గల E.P.ని రాజశ్రీ పైకోర్టునందు దాఖలు చేసి ఉన్నారు. అట్టి E.P.లో రెస్పాండెంట్/జెడిఆర్ అయిన నీకు 21/8/2023 నాడు వాయిదా ఉంటూ ఉన్నది. అట్టి తేదీనాడు ఉదయం 10.30ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై ఏవైన ఆక్షేపణలు ఉన్న ఎడల తెల్పుకోవలసినది. లేనంతట నీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా తేది: 21/8/2023

//By Order of the Court//

పి.చంద్రశేఖర్

పిటిషనరు/ డిహెచ్ఆర్ పరం అడ్వకేట్,

ప్రొద్దుటూరు, కడప జిల్లా. సెల్: 9866635497.